వాహనాల పార్కింగ్‌కు స్థలం గుర్తించాలి

వింగ్ అధికారులతో మేయర్ గుండు సుధారాణి

అధికారులతో సమీక్షిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్, జనవరి 2: పారిశుధ్య వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాన్ని గుర్తించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో వింగ్ అధికారులతో ఆమె సమీక్షించారు. కార్పొరేషన్ పరిసరాల్లో అనువైన ప్రాంతాన్ని గుర్తించి పారిశుధ్య వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ స్థలంలోనే వాహనాలను శుభ్రం చేయాలన్నారు. తుప్పు పట్టిన వాహనాలను స్క్రాప్ కింద అమ్మకానికి టెండర్ పిలవాలని ఇంజినీర్లను ఆదేశించారు. అనంతరం మేయర్ బల్దియా కార్యాలయ ఆవరణను తనిఖీ చేశారు. ప్లానిటోరియం, మ్యూజికల్ గార్డెన్‌ను పరిశీలించి, ఇండోర్ స్టేడియం సమీపంలో నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్‌ను రెండు నెలల్లో పూర్తి చేయాలన్నారు. మ్యూజికల్ గార్డెన్‌కు ఎదురుగా ఉన్న బల్దియా స్థలంలో గ్రీనరీ అభివృద్ధి చేయాలని సూచించారు. అక్కడే వినాయక విగ్రహాల తయారీకి షెడ్ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకరలింగం, హెచ్‌వోలు రమేశ్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్, కృష్ణారెడ్డి, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కృషి

పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

హనుమకొండ, జనవరి 2 : స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో గురువారం వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదతో కలిసి ఆయన సమీక్షించారు. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తే గ్రామీణ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారన్నారు. పరకాల నియోజకవర్గంలో పాల సేకరణ కేంద్రాలు, మహిళా సంఘాల ద్వారా ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ కేంద్రాలు, ప్రతి మండలంలో 350 మందిని గుర్తించి వారికి టైలరింగ్ తర్ఫీదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వీటికి ఉయ్‌హబ్ (ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్) సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా చేసిన ఉత్పత్తులకు దేశీయ, విదేశీ మార్కెట్లలో విక్రయించేలా చర్యలు చేపడితే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మార్కెట్ డిమాండ్ మేరకు వస్తువులు తయారు చేసేలా స్వయం సహాయక సంఘాల సభ్యులకు నైపుణ్యాలతో కూడిన శిక్షణ ఇవ్వాలన్నారు. ఉయ్‌హబ్ సీఈవో సీత మాట్లాడుతూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే హబ్ ముఖ్య ఉద్దేశమన్నారు. సమీక్షలో డీఆర్వో వైవీ గణేశ్, పరకాల ఆర్డీవో నారాయణ, హనుమకొండ, వరంగల్ డీఆర్డీవోలు మేన శ్రీను, కౌసల్యాదేవి పాల్గొన్నారు.

ఎట్టకేలకు తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఖిలావరంగల్, జనవరి 2: ధర్మసాగర్ నుంచి అండర్ రైల్వేగేటు ప్రాంతానికి తాగునీటి సరఫరా జరిగే ప్రధాన పైపులైన్ ఖిలావరంగల్ వై జంక్షన్‌లో గత నెల 31న పగిలిపోయి లక్షల లీటర్ల తాగునీరు వృథాగా పోయింది. ఖిలావరంగల్ రోడ్డుపై మోకాలు లోతు నీటి ప్రవాహం కొనసాగింది. దీంతో మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గురువారం అధికారులు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. మరమ్మతులకు ఆటంకం కలుగకుండా ఖమ్మం వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. రెండు రోజుల వరకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

వరంగల్: ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి వచ్చే ప్రధాన పైపులైన్ ఖిలా వరంగల్ పెట్రోల్ పంపు వద్ద లీకేజీ మరమ్మతులు కొనసాగుతున్న నేపథ్యంలో అండర్ రైల్వేగేట్ జోన్‌లో శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర తెలిపారు. నాగమయ్య దేవాలయ ప్రాంతం, నాగేంద్రనగర్, శివనగర్, చింతల్, ఖిలావరంగల్ తూర్పు, మధ్య కోటలు, మైసయ్యనగర్, కాశీకుంటకు తాగునీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

రాయితీపై వరి విత్తనాలు

ఖానాపురం, జనవరి 2: మండలకేంద్రంలోని రైతు వేదికలో రాయితీపై వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో శ్రీనివాస్ తెలిపారు. కేఎన్ఎం-118 రకం వరి విత్తనాలు 25 కిలోల సంచి రూ. 500లకే లభిస్తుందన్నారు. విత్తనాలు కావాల్సిన అన్నదాతలు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను వెంట తీసుకొని, సెల్‌ఫోన్ నంబర్‌తో రైతు వేదికలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **VELUDANDI SREEDEVI (New Name),** R/o H.No. 15-6-194, Papaiahpet, Warangal Mandal, Warangal District - 506002 TG, Have Changed my name from **RSS SREEDEVI (OLD NAME),** To **VELUDANDI SREEDEVI (New Name)** for all purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెక్కొండ, జనవరి 2: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన వెంకటాపురంలో జరిగింది. గ్రామానికి చెందిన వర్రె సహదేవుడు(30) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎంజీఎం దవాఖానలో చేరాడు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందాడని నెక్కొండ ఎస్సై మహేందర్ తెలిపారు. మృతుడి భార్య వర్రె సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

వర్ధన్నపేట(రాయపర్తి), జనవరి 2: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వర్ధన్నపేట ఎస్సై మేరుగు రాజు కథనం ప్రకారం.. మండలంలోని దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న మేకల సదయ్య బైక్‌పై వర్ధన్నపేట నుంచి దమ్మన్నపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దమ్మన్నపేట వైపు నుంచి మేకల ప్రశాంత్ బైక్‌పై వేగంగా వస్తూ పట్టణ శివారులో ఎదురుగా ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా, వారిని దవాఖానకు తరలించారు. ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

కళాకారుడు హష్మీకి నివాళి

కరీమాబాద్, జనవరి 2: కళాకారుడు, రచయిత, దర్శకుడు హష్మీ వర్ధంతిని గురువారం ప్రజా నాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉర్సు గుట్ట సమీపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్య మండలి జిల్లా కమిటీ కార్యదర్శి దుర్గయ్య మాట్లాడుతూ హష్మీ సేవలు మరువలేనివన్నారు. వీధి నాటకాలను పోరాట ఆయుధంగా మలిచిన వీరుడని కొనియాడారు. ఆయన రచనలు, నాటకాలు ప్రజల్లో చైతన్యం నింపాయన్నారు.

మామిడి ఎగుమతుల్లో పోటీ పడాలి

- వ్యవసాయ శాఖ అధికారులు రైతులను చైతన్యం చేయాలి
- అవగాహన కార్యక్రమానికి మామిడి రైతులను తీసుకురావాలి
- వరంగల్ కలెక్టర్ సత్యశారద
- మామిడి రైతులకు సౌకర్యాలు కల్పించాలి
- చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

కాశీబుగ్గ, జనవరి 2: మామిడి సాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక ఉత్పత్తులు సాధించి, ఎగుమతుల్లో పోటీ పడాలని కలెక్టర్ సత్యశారద రైతులను కోరారు. మామిడి సీజన్ ఏర్పాట్ల కోసం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధి ముసలమ్మకుంట లోని మార్కెట్ కమిటీ గోదామును గురువారం ఆమె సందర్శించారు. అనంతరం వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేటలో శుక్రవారం నిర్వహించనున్న మామిడి రైతుల అవగాహన కార్యక్రమంపై మార్కెట్ ప్రధాన కార్యాలయంలో పండ్ల వ్యాపారులు, మార్కెటింగ్ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ముఖ్యంగా వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి మండలాల్లో మామిడి పంట పండించే రైతులు అధికంగా ఉన్నందున నాణ్యమైన సాగు పొందేలా వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యాన శాఖ అధికారుల ద్వారా రైతుల్లో చైతన్యం కల్పించాలని కలెక్టర్ సూచించారు. శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కల్పించనున్న దృష్ట్యా మామిడి రైతులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మామిడి పంటల ఎగుమతులను ప్రోత్సహించేందుకు తగిన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ముసలమ్మకుంట గోదాం వరకు రోడ్డు, వీధి లైట్లు, రైతులు, వ్యాపారులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని సత్యశారద హామీ ఇచ్చారు. సమీక్షలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కలకోట్ల సురేఖ, మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, హార్టికల్చర్ అధికారి రాకేశ్, పండ్ల వ్యాపారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెల్ది సాంబయ్య, దొంగల చెన్నమల్లుయాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలపై సమీక్ష

గీసుగొండలోని జడ్పీహెచ్ఎస్‌లో ఈ నెల 8 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలపై కలెక్టర్ తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని, వీరందరికీ మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. సమీక్షలో డీఆర్వో విజయలక్ష్మి, డీఈవో జ్ఞానేశ్వర్, వరంగల్ ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, గీసుగొండ తహసీల్దార్ రియాజోద్దీన్, డీఎస్ఓ సత్యవాణి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నూతన సంవత్సర వేడుకలు

వరంగల్ కలెక్టరేట్‌లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరించారు. సరికొత్త ప్రణాళికలతో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు జిల్లా అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని ఆమె కోరారు. అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, ఏవో విశ్వప్రసాద్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, బీసీ, ఎస్సీ, సంక్షేమ శాఖ అధికారులు అధికారి పుష్పలత, భాగ్యలక్ష్మి, డీడబ్ల్యూవో రాజమణి, డీపీవో కల్పన, టీజీటీఏ అసోసియేట్ ప్రెసిడెంట్ ఎండీ ఇక్బాల్, టీజీవోస్, టీఎన్జీవోస్, ట్రెస్మా అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గిర్మాజీపేట, జనవరి 2: ఆపదలో ఉన్న బాల్య మిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. తమతో కలిసి పదో తరగతి వరకు చదువుకున్న వనం రాజ్‌కుమార్ రెండేండ్ల క్రితం చనిపోచాడు. దీంతో అతడి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. విషయం తెలుసుకున్న 1997-98 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు గురువారం మిత్రుడి కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎలగొండ రాజేశ్వర్, కోరె రమేశ్, వనం రవికుమార్ పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాన్ని వినియోగించుకోవాలి

నల్లబెల్లి, జనవరి 2: మండల ప్రజలు ఆధార్ శిబిరాన్ని వినియోగించుకోవాలని తహసీల్దార్ ముప్పు కృష్ణ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు మండలకేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆధార్ సేవా శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 2010 నుంచి 2016 సంవతర్సం మధ్యలో ఆధార్ నమోదు చేసుకున్న వారు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డులతో రావాలని కోరారు. అడ్రస్ మార్పునకు రూ. 50, బయోమెట్రిక్ అప్‌డేట్‌కు రూ. 100 చెల్లించాలని సూచించారు. కొత్తగా ఆధార్ చేయించుకునే పిల్లలకు ఉచితమన్నారు.

డీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

నల్లబెల్లి, జనవరి 2: డెమోక్రటీవ్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తూముల రఘువీర్, ఉపాధ్యక్షులుగా పి.రవి, మంజుల, ప్రధాన కార్యదర్శిగా కందుల గోవర్ధన్, సహాయ కార్యదర్శులుగా నటరాజ్, నరసింహ, కైలాసం, జిల్లా కౌన్సిలర్లుగా అరుణాదేవి, సభ్యులుగా చందర్, ప్రశాంత్, మనోహర్‌స్వామి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కొమ్మాలు, రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడిగా మహేందర్‌రెడ్డి వ్యవహరించారు. సీనియర్ నాయకుడు యాకూబ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం

కరీమాబాద్, జనవరి 2: ఇటీవల పీహెచ్‌డీ సాధించిన రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ భగీరథ్‌కు తోటి మిత్రులు, విద్యార్థులు గురువారం కళాశాలలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. పీహెచ్‌డీ పొందడం చాలా సంతోషంగా ఉందని భగీరథ్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

ఖిలావరంగల్, జనవరి 2: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమైనట్లు గురువారం సీఐ జే వెంకటరత్నం తెలిపారు. వరంగల్ లేబర్‌కాలనీకి చెందిన చుక్క జానీ(35) నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 10న విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే, తూర్పుకోటకు చెందిన సిరబోయిన యాకయ్య(81) కుటుంబ సభ్యులతో గొడవపడి గత నెల 31న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. అతడి కుమారుడు సోమేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు.

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ కవిత

అభివృద్ధి పనులు ప్రారంభం

నర్సంపేట, జనవ 2: పట్టణంలోని 3వ వార్డులో పలు అభివృద్ధి పనులను గురువారం కౌన్సిలర్ కవిత ప్రారంభించారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ వీరన్న, కొంపెల్లి రాజేందర్, గూడూరు సందీప్, ఠాకూర్ విజయ్‌సింగ్, నాగేంద్రాబాబు, ముత్యం శ్రీనివాస్, రామగిరి యాదగిరి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పెంచిన కూలీ రేట్ల జీవో విడుదల చేయాలి

నర్సంపేట: వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

నర్సంపేట, జనవరి 2: సివిల్ సప్లయ్ హమాలీలకు పెంచిన కూలీ రేట్ల జీవోను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలో సివిల్ సప్లయ్ హమాలీలు గురువారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు అందించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం జీవో అమలుపై కాలయాపన చేస్తూ కార్మికులపై వివక్ష చూపుతోందని విమర్శించారు. హమాలీల నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి చింతకింది కుమారస్వామి, సివిల్ సప్లయ్ హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు కొత్త గట్టు నర్సింగం, బక్కెర కిశోర్, మిట్టపల్లి మహేందర్, రవి, కుమారస్వామి, ముద్రబోయిన మహేందర్, మల్లయ్య పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె

కాశీబుగ్గ: పెంచిన కూలీ రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సివిల్ సప్లయ్ హమాలీలు గురువారం ఎనుమాముల మార్కెట్ పరిధిలోని గోదాం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టారు. కేంద్రం కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. సమ్మెలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు జీ మునీశ్వర్, జీ రమేశ్, సతీశ్, దామెర కృష్ణ, పీ అనిల్, కంచె రవి, గండ్రకోట చంద్రమౌళి, దేవర బేనా, రాంబాబు పాల్గొన్నారు.

రెండు రోజుల దీక్షను విజయవంతం చేయాలి

పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న బాబు

మట్టెవాడ, జనవరి 2: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న రెండు రోజుల దీక్షకు కార్మికులు తరలిరావాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి సింగారపు బాబు పిలుపునిచ్చారు. నగరంలోని 29 డివిజన్ పరిధిలో బుధవారం రామన్నపేట పారిశుధ్య కార్మికులతో సీఐటీయూ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ నెల 4, 5వ తేదీల్లో గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తామన్నారు. రాష్ట్రంలోని 65 వేలకుపైగా ఉన్న పారిశుధ్య కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా కనీస వేతనంగా రూ. 26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కే సుమన్, ఎండీ కలీం, సాంబరాజు, మైహరమ్స్, సుమన్, జేడీ బాలయ్య, ఇల్లందుల శంకర్, ఇందిర, ఆర్ శిరీష, అనిత, సమ్మక్క, పుల్లమ్మ పాల్గొన్నారు.

రెండు నెలల్లో బయో మైనింగ్ పూర్తి చేయాలి

మడికొండలో బయో మైనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్, జనవరి 2 : డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను రెండు నెలల్లో బయో మైనింగ్ ద్వారా శుద్ధి చేసి స్థలాన్ని అప్పగించాలని బయో మైనింగ్ కాంట్రాక్ట్ పొందిన ఏజెన్సీ ప్రతినిధులను బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఆదేశించారు. గురువారం ఆమె మడికొండలోని డంపింగ్ యార్డును పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం నగరంలో పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాలసముద్రం, పోతననగర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్వహణ తీరును పరిశీలించిన ఆమె చెత్త సేకరణ క్రమపద్ధతిలో చేయాలని సూచించారు. నయీంనగర్ బ్రిడ్జి రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి బాలకృష్ణ

చెన్నారావుపేట, జనవరి 2: ప్రజలు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ అన్నారు. మండలంలోని లింగగిరి గ్రామంలో ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో గురువారం స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు, వ్యాపారులు, యువకులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బ్యాంక్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బ్యాంకు బీమా పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఆర్థికపరమైన మోసాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సదస్సులో లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్‌సీ జిల్లా కౌన్సిలర్ భాస్కరాచారి, కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్, కట్ట స్వామి, మహిళా సంఘం ప్రతినిధులు, రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి సామాజిక సేవ శిక్ష

పోచమ్మమైదాన్, జనవరి 2: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి సామాజిక సేవ శిక్ష విధించారు. పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఐనవోలుకు చెందిన ఆటో డ్రైవర్ గుండెబోయిన రాజు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డాడు. అతడిని గురువారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా, రెండు రోజులపాటు సామాజిక సేవ శిక్ష విధించారని ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. అతడితో వరంగల్ తహసీల్దార్ కార్యాలయాన్ని శుభ్రం చేయించినట్లు చెప్పారు.

రాయపర్తిలో గడ్డివాము దగ్ధం

రాయపర్తి, జనవరి 2: మండలకేంద్రంలోని హైస్కూల్ రోడ్డులోని మేకల పద్మకు చెందిన గడ్డివాము గురువారం కాలిపోయింది. పద్మ తన పశువుల కోసం రూ. 35 వేలు వెచ్చించి గడ్డిని తీసుకొచ్చి వాముగా పేర్చుకుంది. ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. సిబ్బంది వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే కాలలిపోయినట్లు బాధితురాలు తెలిపారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సృజన్‌తేజ

విద్యార్థులపై టీచర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సృజన్‌తేజ

నర్సంపేట, జనవరి 2: విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సృజన్‌తేజ సూచించారు. మహేశ్వరంలోని బాలుర గురుకుల విద్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతుల వారీగా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. రికార్డులు, వంట గదిలోని సరుకులు, భోజన నాణ్యతను పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎఫ్ఏ-3 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ప్రగతిని వెంటనే ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలన్నారు. విద్యార్థులను అన్ని సబ్జెక్టుల్లో తీర్చిదిద్దాలన్నారు. పిల్లలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయ ప్రత్యేక అధికారి ఎండీ ఇసాక్ అలీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్

గర్భిణులకు అవగాహన కల్పించాలి

ఖానాపురం, జనవరి 2: గర్భిణులకు అవగాహన కల్పించి, సర్కార్ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. జాతీయ